సాక్షి శ్రీకాకుళం

శనివారం । 16 । డిసెంబర్ । 2023



వినూత్న సాగు.. బతుకు బాగు

ఓ రైతు సాగులో వినూత్న పద్ధతులు పాటిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

- 8లో



రెండు ఆలయాల్లో చోరీ

ఆమదాలవలసలో రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. రాత్రి పూట దుండగులు ప్రవేశించారు.

- 8లో

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలో 62 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తుండగా, 15,045 మంది హాజరయ్యారు. ఈ నెల 27 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలు పర్యవేక్షించారు. సజావుగా మొదటి రోజు పరీక్షలు జరిగినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి వి.విశ్వమోహన రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన / వెనుక బడిన వర్గాల అభ్యర్థులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. 2023లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థులు ప్రోత్సాహకం కోసం 'జ్ఞానభూమి. ఏపీ.జీఓవీ.ఐఎన్' పోర్టల్లో ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సన్మానిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ రాజేంద్ర ప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ ప్రగతికి కృషిచేస్తున్న అధికార యంత్రాంగానికి బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. హెచ్.ఏ.రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన సత్కరించా రు. వీసీ మాట్లాడుతూ రూ. 18 కోట్లతో నిర్మించిన వసతి గృహం భవనాన్ని సీఎం చేతులమీదుగా ప్రారంభించేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సహకారంతో వర్సిటీని అభివృద్ధి చేస్తామన్నారు.

23న జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిలుస్తుందని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీసీ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడారు. ఈనెల 23వ తేదీన పాత కార్యవర్గం స్థానంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ రోజు ప్రతి పాఠశాల నుంచి హెచ్‌ఎం, స్కౌట్ మాస్టర్ విధిగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఎంఈఓ జి.రాజేంద్రప్రసాద్, పూర్వపు సెక్రటరీ టీఏఎస్ శర్మ, నాయుడు, ఏఎస్‌డీసీ దుర్గా నాగేశ్వరరావు, డీటీసీ బుజ్జిబాబు, 16 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్లు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో విషయ పరిజ్ఞానం పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: విజ్ఞాన క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పూర్తిస్థాయిలో పెంపొందుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో యాడాన్ కోర్సు 'ఫిజిక్స్ ఫర్ నోవెల్ డయాగ్నస్టిక్స్ అండ్ థెరప్యూటిక్స్'కు అనుబంధంగా కళాశాల బీఎస్సీ ఫిజిక్స్ విద్యార్థులు విజ్ఞాన క్షేత్ర పర్యటనలు చేశారు. ఇందులో భాగంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో విద్యార్థినులు సీటీ, ఎంఆర్ఐ, ఎక్స్‌రే స్కాన్ విభాగాలతో పాటు నిపుణులతో పరికరాల పరిశీలన, పని చేసే విధానం తెలుసుకున్నారు. అలాగే విశాఖపట్నంలోని ముషిడివాడలోని సోలార్ పవర్ ప్రాజెక్ట్ సందర్శనకు కూడా వెళ్లారు. వీరి వెంట కళాశాల ఫిజిక్స్ లెక్చరర్లు, ఇతర అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగుల స్పందనకు 4 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు నాలుగు వినతులు వచ్చాయి. స్పందనకు హాజరయ్యే ముందు సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని రావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి సూచించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

క్యాన్సర్ చికిత్సకు సిద్ధం

- రిమ్స్‌లో క్యాన్సర్ చికిత్సకు ప్రత్యేక విభాగం
- త్వరలోనే విధివిధానాలు ఖరారు
- ఆస్పత్రిలో ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు ప్రతిపాదన





శ్రీకాకుళం: క్యాన్సర్ బాధితులకు పెద్ద ఊరట లభించనుంది. జిల్లాలోనే చక్కటి వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు శ్రీకాకుళంలోని రిమ్స్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్సకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని క్యాన్సర్ రోగులు చికిత్స కోసం విశాఖపట్నం, గుంటూరు, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లా ప్రజలకు ఓ వరంగా చెప్పుకోవచ్చు.

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ రోగుల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులను నమిలేవారు, అడ్డపొగ (చుట్టకాల్చుట) వారు ఎక్కువగా ఉన్నారు. అదే విధంగా గుట్కా, ఖైనీ, గుడాకు వంటి వాటిని వినియోగించటం వల్ల నోటి సంబంధిత క్యాన్సర్ బారిన ఎక్కువగా పడుతున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి జిల్లాలోకి వస్తున్న నాటుసారా తాగి లివర్ క్యాన్సర్‌తో పాటు మరికొన్ని అవయవాల క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. క్యాన్సర్‌ను గుర్తించే అవకాశం కూడా లేకపోవటంతో వ్యాధి ముదిరిన తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఎట్టకేలకు రిమ్స్‌లో క్యాన్సర్ విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించటం ప్రజల్లో సంతోషాన్ని నింపుతుంది.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీని రూ.25లక్షలకు పెంచి, 3వేలకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చింది. దీంతో పాటు అనారోగ్యం బారిన పడుతున్న వారిని గుర్తించేందుకు ఆరోగ్య సురక్ష నిర్వహిస్తోంది. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. క్యాన్సర్ విభాగానికి చెందిన పోస్టులు కూడా త్వరలోనే మంజూరు కానున్నాయి.

ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు ప్రతిపాదన

శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో మరో 25 ఎంబీబీఎస్ సీట్లు పెరగనున్నాయి. ప్రస్తుతం 175 సీట్లు ఉండగా, అదనంగా 25 సీట్ల కోసం ప్రతిపాదన పంపించారు. సౌకర్యాల పరిశీలనకు ఎంసీఐ బృందం వచ్చే అవకాశం ఉంది. 2007లో రిమ్స్ వైద్య కళాశాలను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 60 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభించారు. దశల వారీగా 175 సీట్లకు చేరింది. 2007లో రూ.100 కోట్లతో రిమ్స్‌ను మంజూరు చేయగా, డాక్టర్ వైఎస్సార్ హయాంలో పనులు చురుగ్గా జరిగాయి. ఆయన మరణానంతరం ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్ల పీజీ సీట్లు, అనుబంధ కళాశాలలు నెలకొల్పకుండా ఉండిపోయాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత భవన నిర్మాణాలు చకచకా పూర్తవ్వడం, అధునాతన యంత్రాలు రావడంతో పాటు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కావడం, కొత్త పోస్టులు మంజూరవ్వడం జరిగాయి. ఈ కారణంగానే ఎంబీబీఎస్ సీట్లు రెండేళ్ల కిందట 50 వరకు పెరిగాయి. అలాగే సౌకర్యాలు లేకపోవడం వల్ల పీజీ సీట్లు ఏడాది క్రితం వరకు 19 వరకు మాత్రమే ఉండేవి. గత ఏడాది ఒకేసారి ఆ సంఖ్య 58కి పెరిగింది. అలాగే నర్సింగ్ కళాశాలకు సొంత భవనం సమకూరింది. దీంతో ఇప్పుడు ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య కూడా పెరుగుతుందని ఆశిస్తున్నారు.

సిద్ధంగా ఉన్నాం



ఎంసీఐ బృందం ఎప్పుడు వచ్చినా మేం సిద్ధంగా ఉన్నాం. 25 సీట్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఎంసీఐ పరిశీలనకు ఎప్పుడు వచ్చినా సంతృప్తి వ్యక్తం చేస్తుందన్న ధీమా ఉంది. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు రోగులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు వైద్య సీట్లు పెరిగేందుకు దోహదపడుతుంది.

– డాక్టర్ స్వామినాయుడు, రిమ్స్ సూపరింటెండెంట్

వినతి అందిన 24 గంటల్లోనే..

- వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం జమ చేసిన ప్రభుత్వం
- రూ.43.98 కోట్లు విడుదల
- నిర్వాసితుల్లో వెల్లివిరిసిన సంతోషం



కొత్తూరు, ఎల్ఎన్ పేట: విన్నపం అందిన 24 గంటల్లో వంశధార నిర్వాసితుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూపించే చొరవకు ఇది మరో ఉదాహరణ. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభానికి గురు వారం సీఎం రాగా.. పెండింగ్‌లో ఉండిపోయిన పరిహారం గురించి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సీఎంకు విన్నవించారు. ఆయన వెంటనే అదనపు పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు అదనపు పరిహారాలు జమ అయ్యాయి. హిరమండలం, కొత్తూరు ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన నిర్వాసితులకు యూత్ ప్యాకేజీ, నిర్వాసిత కుటుంబాలకు, భూములకు గాను రూ. 43.98 కోట్లను ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. దీంతో నిర్వాసితుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

23 గ్రామాల్లో వేలాది మంది నిర్వాసితులు

హిరమండలం మండల కేంద్రంలో సుమారు 10వేల ఎకరాల్లో వంశధార రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా పూర్తిగా, పాక్షికంగా రిజర్వాయర్‌లో కలసిపోయిన 23 గ్రామాలకు చెందిన వేలాది మంది నిర్వాసితులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అదనపు పరిహారంగా ఇదివరకు రూ.216.71 కోట్లు నిధులను విడుదల చేసింది. అయితే అప్పట్లో సకాలంలో దరఖాస్తు చేసుకోలేక, విచారణ సమయంలో సరైన సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో కొందరు నిర్వాసితులు మిగిలిపోయారు. వారిందరి కోసం బాకీగా ఉన్న రూ.43.98 కోట్లు నిధులను సీఎం విడుదల చేయగా శుక్రవారం నుంచి జమ అవుతున్నాయి. మొత్తం 2,082 మంది నిర్వాసితులకు (పీడీఎఫ్)కు లక్ష చొప్పున రూ.20.82 కోట్లు, 2,316 ఎకరాలు గాను ఎకరాకు లక్ష చొప్పున భూమి కోల్పోయిన రైతులకు రూ.23.16 కోట్లు జమ చేశారు.



నిర్వాసితుల మొబైల్‌కు వచ్చిన మెసేజ్

ఇచ్చిన మాట ప్రకారం..



వంశధార నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం అందరికీ అదనపు పరిహారం అందేలా చర్యలు తీసుకోవటం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం 2017లో వంశధార నిర్వాసితులను ఎముకలు కొరికే చలిలో గ్రామాల నుంచి బయటకు పంపించారు. అప్పుడు వారి కష్టాలను చూసిన నా మనసుకు ఎంతో బాధ కలిగింది. వారికి అండగా నిలవాలని అనుకున్నాను. వారికి అదనపు పరిహారం తీసుకురావటంలో నిరంతరం శ్రమించాను. నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో నిధులు పడుతున్నాయంటే ఎంతో సంతోషంగా ఉంది. జగనన్నకు నిర్వాసితుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

రూ.లక్ష పడింది..



శుక్రవారం నా బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ అయ్యింది. టీడీపీ ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన నిర్వాసితులకు సీఎం వైఎస్ జగన్ పరిహారాలు చెల్లించడం సంతోషంగా ఉంది.

– బర్రి భానుప్రియ, వంశధార నిర్వాసితురాలు

'సీఎం వైఎస్ జగన్ చిరకాలం గుర్తుంటారు'



ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ప్రధాన సమస్యలు పరిష్కరిస్తూ వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిరకాలం గుర్తుండిపోతారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్స్‌లర్, విశాఖపట్నం రాజధాని సాధన కమిటీ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. ఆయన శుక్రవారం ఎచ్చెర్లలో మాట్లాడారు. కిడ్నీ పరిశోధన కేంద్రం చికిత్స, అధ్యయనం రెండింటికీ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలన్నారు. 2015లో యునిసెఫ్ ప్రాజెక్టు కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు సర్వేలు నిర్వహించినట్లు చెప్పారు. సురక్షిత తాగునీరు అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. పరిశోధనలు ముమ్మరంగా నిర్వహించి కారణాలు తెలుసుకుంటే కిడ్నీ వ్యాధిని అదుపులోకి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేవారే నిజమైన పాలకులని అన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకుందాం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపు



వారోత్సవాల కరపత్రాలను ప్రదర్శిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్ఈ కృష్ణమూర్తి

అరసవల్లి: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుందామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇంధన పొదుపు వారోత్సవాల కరపత్రాలను కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. అంతకుముందు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో డిసెంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను, జిల్లాలో నిర్వహించబోయే అవగాహన కార్యక్రమాల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ పొదుపు గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈలు సత్తారు బైరినాయుడు, ఈఈ టెక్నికల్ ఎల్‌సీహెచ్ పాత్రుడు, ఎస్ఏఓపీ తాతాచార్యులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ కప్ పోటీలకు 'పూజారి'



పూజారి వెంకటరమణను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ ఫెడరేషన్ కప్ పోటీలకు జిల్లాకు చెందిన పూజారి వెంకటరమణ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఔరంగాబాద్ వేదికగా జాతీయ ఫెడరేషన్ కప్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాలోని ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన పూజారి వెంకటరమణ ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈ యువ క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

శిక్షణ శిబిరాలకు హాజరు..

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు ముందు జరిగే శిక్షణ శిబిరాలకు వెంకటరమణ హాజరయ్యాడు. ఈ శిక్షణ శిబిరాలు అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడా ప్రాంగణం వేదికగా ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు 8 రోజులుపాటు జరగనున్నాయి. వెంకటరమణ తల్లిదండ్రులు పూజారి గోవిందరావు, సుశీల. వీరిది వ్యవసాయ కుటుంబం. డిగ్రీ పూర్తి చేసిన ఈ యువకుడు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఐటీఐ శిక్షణ సంస్థలో ఎలక్ట్రికల్ ట్రేడులో ఐటీఐ చదువుతున్నాడు. జాతీయ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి అభినందనలు తెలిపారు.

● అభిషేక ప్రియుడు



హరిహర సుతునికి అష్ట ద్రవ్యాలతో అభిషేకం అపురూపంగా జరిగింది. శ్రీకాకుళం బలగలోని అయ్యప్ప ఆలయంలో ఆరాట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేరళ సంప్రదాయ పద్ధతుల్లో స్వామిని అర్చించి అభిషేకించారు. నదీ స్నానం, శతక కలశ ఆరాధన, అభిషేకాలు ఘనంగా జరిగాయి. - శ్రీకాకుళం కల్చరల్

సుడాలో సులువుగా అనుమతి

- గ్రామీణ, పట్టణాల విస్తరణే సుడా లక్ష్యం
- వీఎంఆర్‌డీఏ నుంచి 2019లో సుడాలోకి మార్పు
- ఆదాయ మార్గాల వైపు సుడా అడుగులు
- ఏపీడీపీఎంఎస్ ద్వారా రూ 18.41కోట్లు ఆదాయం



సుడా కార్యాలయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) ఆదాయ మార్గాల అన్వేషణలో కొత్త పద్ధతులు ప్రవేశ పెడుతోంది. సులువుగా ప్లాన్ అనుమతులు ఇచ్చేలా ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సరసన గ్రామీణ ప్రాంతాలను ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో సుడాను ఏర్పాటుచేసింది. దీంతో సులువుగా సుడాలో నిర్మాణాలకు, లేఔట్ల ఏర్పాటుకు ప్లాన్ అప్రూవల్స్ ఆన్‌లైన్‌లో ఇస్తున్నారు. గతంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా రియల్టర్లు ఇష్టం వచ్చినట్లు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, కొలతలు నిబంధనలు పాటించకుండా ఏర్పాటుచేసేవారు. డబ్బులు సంపాదనే ధ్యేయంగా వ్యాపారులు సైట్ల కొనుగోలుదారులను మోసగించేవారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు, వాటన్నింటిని పరిశీలించి అప్రూ వల్స్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2019లో జీఓఎంఎస్ 119 ద్వారా జిల్లాకో కార్యాలయాన్ని ఏర్పాటుచేసింది. దీనిలో భాగంగానే 'సుడా' ఏర్పాటుచేశారు. అంతకు ముందు వీఎంఆర్‌డిఏ పరిధిలో ఉండేది.

2019 నుంచి 2023 వరకు ఏపీడీపీఎంఎస్ ద్వారా వచ్చిన ఆదాయం

సంవత్సరం	రెవెన్యూ (రూ.కోట్లు)
2019–2020	1.08
2020–2021	3.21
2021–2022	6.74
2022–2023	7.37

350 చదరపు మీటర్లకు పైగా 7 సెంట్ల నిర్మాణాల ప్లాన్‌లకు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో 1200 చదరపు మీటర్లకుపైగా 25సెంట్లలో నిర్మాణాలకు అనుమతులు పొందిన వివరాలు

సంవత్సరం	అనుమతులిచ్చిన భవనాలు	ఆదాయం రూ.కోట్లలో
2020	8	0.74
2021	230	1.907
2022	416	5.91
2023	243	6.20

దరఖాస్తులు సులభం..

ఉమ్మడి జిల్లాలో ఉండే 38 మండలాల్లో సీతంపేట ఒక్కటి తీసేస్తే మిగిలిన 37 మండలాలు సుడా పరిధిలోకి వస్తాయి. 1647 గ్రామాలు సుడా పరిధిలోకి వస్తాయి. ఆయా మండలాల్లో లేఔట్లు, నిర్మాణాలు చేపట్టదలచిన వారు 'ఏపీడీపీఎంఎస్' వెబ్‌సైట్‌లో సులువుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. భవన నిర్మాణదారులు, లేఔట్లు ఏర్పాటుచేయదలచివారు ఎల్‌టీపీల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో మాన్యువల్‌గా ఉండే సమయంలో వ్యయప్రయాసలు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేవు. అత్యంత సులువుగా ప్లాన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. పేమెంట్ ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.

వారంలో అనుమతి..

కార్పొరేషన్ పరిధిలో 25 సెంట్లు దాటితే సుడాలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లేఔట్ల ఏర్పాటుకి జీఓఎంఎస్ 275 ద్వారా 40 అడుగులు రోడ్లు ఉండాలి. లేఔట్ ఏరియాలో 10శాతం ఓపెన్ స్పేస్, 0.5శాతం యుటిలిటీ నిబంధనలతో లేఔట్ల ఏర్పాటుకి అవకాశం కల్పించారు. సుడా పరిధిలో ప్లాన్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే డబ్బులు చెల్లించాలే తప్ప అదనంగా ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. అన్ని రకాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే వారం రోజుల్లో ప్లాన్ అప్రూవల్ చేస్తారు. నిబంధనల ప్రకారం లేఔట్లు ఏర్పాటు చేసిన వాటిలో ప్లాట్లు కొనుగోలు చేస్తే బ్యాంకు రుణం పొందే అవకాశం కల్పించారు. ప్రజలకు వారి ఆస్తులపై భరోసా కల్పించారు.

పారదర్శకంగా అనుమతులు



ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకంగా లే ఔట్లు, నిర్మాణాల ప్లాన్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాం. జిల్లాలో ఏ గ్రామానికి చెందినవారైనా జిల్లా కేంద్రంలో గల సుడా కార్యాలయానికి రావాల్సిన పనిలేదు. తమ ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సులువుగా ప్లాన్ అప్రూవల్స్ ఇస్తున్నాం. ఎవరైనా ప్లాన్‌లకు దరఖాస్తు చేసుకునేవారి వద్ద అదనపు వసూళ్లకు పాల్పడితే మా దృష్టికి తీసుకురావాలి.

– టీజీ రామ్మోహన్‌రావు, సుడా, ప్లానింగ్ ఆఫీసర్

'సీఎం ఆత్మవిశ్వాసం పెంచారు'



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనలో ఆత్మవిశ్వాసం పెంచారని సోంపేట పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కదంబాల మోహనరావు అన్నారు. గత ఏడాది జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడ్డానని, ఒక కాలు తీసేశారని ఆయన తెలిపారు. 18 నెలలుగా విశాఖలో చికిత్స తీసుకుంటున్నానని, అయితే ఆర్టీసీ విధుల నుంచి తొలగించాక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. తన పరిస్థితిని గురువారం సీఎం వైఎస్ జగన్‌కు చెప్పుకుందామని వెళ్లానని, తనను చూసి కాన్వాయ్‌లోకి ఎక్కించుకున్నారని, తన బాధలు విని సాయం చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సీఎం తనపై చూపించిన ప్రేమ కదిలించిందని తెలిపారు. –సోంపేట

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో రాణించాలి



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ ధనబాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకు రావాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ కోరారు. ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని వై.నళిని జాతీయ యోగా పోటీలకు ఎంపికైంది. ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా, నళిని మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయిలోనూ విజేతగా నిలవాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న ట్రాక్టర్

మందస: మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ దగ్ధమైంది. ఒడిశాలోని కొంతాసాయి గ్రామానికి చెందిన సురోజో అనే వ్యక్తి మందస మండలంలోని కుడుమాసాయి సమీపంలో ట్రాక్టర్, యంత్రంతో కళ్లంలో వరి నూర్పు చేయిస్తున్నాడు. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ నుంచి నిప్పులు రాగా, గడ్డి ఉండడంతో క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. రైతులు ధాన్యాన్ని, వరికుప్పలను వేరు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వరినూర్పు యంత్రానికి పాక్షికంగా నష్టం వాటిల్లగా, ట్రాక్టర్ మాత్రం మంటల్లో కాలిపోయింది. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయ చర్యలు చేపట్టారు.

మద్యం దుకాణం సేల్స్‌మెన్‌ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో విజిలెన్సు సీఐ కుమార్, ఎస్ఐ శ్రీరామమూర్తి తదితరులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులోని 1991 నంబర్ మద్యం షాపులో పని చేస్తున్న ముగ్గురు సేల్స్‌మెన్లు ఎర్ర అటకేశ్వరరావు, జమ్మ బాలరాజు, మెండ పెంటయ్యలను శుక్రవారం అరెస్టు చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబీ ఎస్ఐ బి.అప్పారావు తెలిపారు. కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం విజిలెన్సు సీఐ కేవైఎన్ బీఆర్ కుమార్, ఎస్ఐ బి.శ్రీరామమూర్తి, స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో మద్యం షాపును తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో షాపులో మద్యం బాటిళ్ల కప్పులను తొలగించి వాటిలో తాగునీరు కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు షాపులోని 1150 మద్యం బాటిళ్లు, 8 బాటిళ్ల విడి కప్పులను స్వాధీనం చేసుకున్నారు. ఆ షాపులో సేల్స్‌మెన్లను అరెస్టు చేశారు. ఈ మద్యం బాటిళ్లను పరీక్ష కోసం విశాఖ పంపించినట్లు సీఐ తెలిపారు.

జిల్లా రైతుల ఒడిశా యాత్ర



యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కోసం ఆత్మ, శ్రీకాకుళం సౌజన్యంతో జిల్లాలోని రైతులను అంతర్‌రాష్ట్ర విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ శుక్రవారం తెలియజేశారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్, జైపూర్ ప్రాంతాలకు 30 మంది రైతులు వెళ్లి అక్కడ నూతన పద్ధతులతో కూరగాయల సాగు, ఉద్యాన పంటల సాగు, రైతు ఉత్పత్తిదారు సంఘ నిర్వహణ, వాటి కార్యక్రమాల గురించి తెలుసుకుంటారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి జెండా ఊపి లాంఛనంగా యాత్రను ప్రారంభించారు. శ్రీకాకుళం ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ ఎ.రామచంద్రరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.వెంకటరావు, మండల వ్యవసాయాధికారి రాజేశ్వరరావులు యాత్రకు వెళ్తున్నారు.

వినూత్న సాగు.. బతుకు బాగు

- ఆదర్శ వ్యవసాయం చేస్తూ ముందుకు సాగుతున్న కృష్ణప్రసాద్
- ఢిల్లీలో ఉత్తమ రైతు అవార్డు అందుకున్న వైనం
- గత 20 ఏళ్లుగా వినూత్న రీతిలో వ్యవసాయం చేస్తున్న కర్షకుడు



చామంతి తోటలో రైతు



మిలీనియం ఫార్మర్స్ మీట్‌లో కృషిజాగరణ్ ఉత్తమ రైతు అవార్డు స్వీకరిస్తున్న కృష్ణప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏడాది పొడవునా ఆదాయం రావాలి.. ఉన్న పొలమంతా సద్వినియోగం కావాలి.. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి.. సహజ పద్ధతుల్లో పండించాలి.. ఇవే తారక మంత్రాలుగా ఓ రైతు ఇరవై ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. యువత కొలువుల కోసం పొలానికి దూరంగా పరిగెడుతుంటే.. డిగ్రీ పట్టా ఉండి కూడా ఆయన మట్టినే నమ్ముకున్నారు. అందుకు తగ్గ ఫలాలు కూడా సాధిస్తున్నారు. కొంగరాం గ్రామానికి చెందిన గోపిన కృష్ణప్రసాద్ వినూత్న రీతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఏటా ఖరీఫ్‌లో ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మిగతా 14 ఎకరాల్లో పలు రకాల పంటలు పండిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ డ్రమ్ సీడ్, సీడ్ డ్రిల్ వంటివి ఉపయోగిస్తున్నారు.

360 రోజులూ ఆదాయం..

ఏడాదంతా ఆదాయం పొందేలా పంటలు పండించడం ఈయన ప్రత్యేకత. సూక్ష్మ వ్యవసాయ పద్ధతి అమలు చేస్తూ పాలీ హౌస్‌ల్లో కొన్ని ప్రత్యేక పంటలు సాగుచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రధానమైన ఘన, ద్రవ జీవామృతాల వినియోగం, పశువుల గత్తం, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాల వినియోగం, రసాయన ఎరువులు పూర్తిగా తగ్గిస్తూ వ్యవసాయ చేస్తున్నారు. పెట్టుబడులు తక్కువ చేసి అధిక రాబడులు పొందుతున్నారు. తుంపర, బిందు సేద్యాల వల్ల కలుపు సైతం పంటల్లో తక్కువగా ఉంటుంది. దీంతో వ్యవసాయ సాగులో కూలీల సంఖ్య తగ్గుతుంది. వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలు వచ్చే ప్రతి పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఉచిత విద్యుత్, సూక్ష్మ వ్యవసాయం, సోలార్ విద్యుత్, రాయితీ మీద ఇచ్చే యంత్రాలు వంటివి వినియోగించుకొని ముందుకు సాగుతున్నారు.

రకరకాల పంటలు..

సీజన్‌కు అనుగుణంగా పంటలు సాగు చేయడం ఆయన అలవాటు చేసుకున్నారు. వరి, స్వీట్ కార్న్, టమోటా, క్యాప్సికం వంటి పంటలతో పాటు పుదీనా, కొత్తిమీర ఇతర ఆకుకూరలు, కూరగాయలు, కర్బూజా, పాలీహౌస్‌లో బంతి, చామంతి వంటి పూలనూ సాగు చేస్తున్నారు. ఆకు కూరలు సైతం పాలీహౌస్‌లో పండిస్తూ మార్కెట్‌లో హోల్‌సేల్ దుకాణాలకు విక్రయిస్తున్నారు. వ్యవసాయం చేస్తూనే రూ.10 లక్షల ఆదాయం సాధిస్తున్నారు. వాతావరణం, ధరలు, పరిస్థితులు అనుకూలిస్తే ఇంకా మంచి ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఈయన చేస్తున్న కృషికి కృషి విజ్ఞాన కేంద్ర సిఫార్సుపై న్యూఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ మండలి కృషిజాగరణ్ సంస్థ ఉత్తమ రైతుగా ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన మిలీనియం ఫార్మర్స్ మీట్ –2023 అవార్డు అందుకున్నాడు.

పూర్తిస్థాయి అవగాహనతో వ్యవసాయం

నేను గత 20 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నాను. ప్రారంభంలో వరి పంటకు ప్రాధాన్యత ఇచ్చేవాడిని. ప్రస్తుతం వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాను. 360 రోజులు ఆదాయం వచ్చేలా సాగు చేస్తున్నా. కార్తీక మాసంలో పూలు, కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. ఈ రకంగా ఆదాయం పొందుతున్నాను. వరి పంట ఆధునాతన సాంకేతిక పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. పాలీహౌస్, గ్రీన్ హౌస్ వంటి వాటిలో పూల తోటలు, ఆకు కూరలు పండిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడితో పాటు, ఆదాయం సాధిస్తున్నాను. సూక్ష్మ నీటి సేద్యం అమలు చేస్తున్నాను. ఆకుకూరల సాగు వల్ల మంచి ఆదాయం వస్తుంది.

– గోపిన కృష్ణప్రసాద్, రైతు

అమరజీవికి ఘనంగా నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆయన పేరుతో జిల్లా ఉండటం ఆయన త్యాగాలకు గుర్తుగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్‌డీఓ భరత్ నాయక్, ఉప కలెక్టర్లు జయదేవి, బి పద్మావతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనురాధ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణ రాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎలాంటి ఖర్చు లేకుండా సత్వర న్యాయం అందించడానికి శాశ్వత లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞానసువర్ణరాజు అన్నారు. స్థానిక చైతన్య జూనియర్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా ఉచితంగా ఇక్కడ న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. సేవలు ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఈ తీర్పు అత్యున్నతమైనదని అన్నారు. ఈ తీర్పునకు ఎలాంటి అప్పీలు లేదని వివరించారు. జాతీయ లోక్ అదాలత్‌కు పర్మినెంట్ లోక్ అదాలత్‌కు గల వ్యత్యాసం తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ కె.మురళీధర్, ఏఓ కె.సత్య నారాయణ, అధ్యాపకులు ముకుంద రావు, ఆర్.కృష్ణ, బి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు సింగుపురం విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలారాణి జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయురాలు కె.తిరుమలదేవి శుక్రవారం తెలిపారు. జనవరి 13, 14, 15 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని దయోడిల్‌లో జరగనున్న పోటీలకు విద్యార్థి వెళ్తుందని తెలిపారు. విద్యార్థి ఎంపికపై సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.రవి, కె.అనితశ్రీ తదితరులు అభినందనలు తెలిపారు.


'యువత ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి'



విద్యార్థులకు మై భారత్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వం అందిస్తున్న విద్య, ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఎస్ఎం పురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం ఇంజినీరింగ్, ప్రీ యూనివర్సిటీ విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం శ్రీకాకుళం, స్థానిక జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మై భారత్ యాప్‌పై అవగాహన కల్పించారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా విద్యార్థులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన భవిష్యత్ కోసం దేశంలోని విద్యాలయాల్లో అందిస్తున్న విద్య, ఉద్యోగ రిక్రూట్‌మెంట్‌లు, జాబ్ క్యాలెండర్, సర్వీస్ కమిషన్ పరీక్షలు, నిర్వహణ తీరు, సిలబస్, విధి, విధానాలు తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి సమాచారం అంతా మై భారత్ యాప్‌లో లభిస్తుందన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి రిక్రూట్‌మెంట్‌ల్లో జాతీయ స్థాయిలో అత్యున్నత ఉద్యోగ నియామకాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం కార్యదర్శి రవీంద్ర పాల్గొన్నారు.

'దురహంకార రాతలకు క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్

కంచిలి: కులదురహంకార రాతలకు రామోజీ క్షమాపణలు చెప్పాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు వారు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'పేదపిల్లలకు గవర్నమెంట్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెట్టినప్పుడూ ఇలాగే వ్యతిరేకించారు. మీ పిల్లలు, మీ మనవళ్లు తెలుగు మీడియంలో చదువుతున్నారా? మా పిల్లలు మాత్రం చదవాలని ఎలా ఎలా అంటారు?' అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు గవర్నమెంటు స్కూళ్లలో తమ పిల్లల్ని చదివిస్తూ ఎప్పటికీ పనివారిగా మిగిలిపోవాలా? అని అన్నారు. పేద విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వడం వల్ల చెడిపోతున్నారని పత్రికలో రాయడం రామోజీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బలహీన వర్గాల పిల్లలపై ఎందుకింత విషం చిమ్ముతున్నారని ప్రశ్నించారు. ఇలాంటి చెత్త రాతల్లో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చోరీ జరిగిన ప్రాంతంలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గురువారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని లక్ష్మీ నగర్ వీధిలో గల కన్యకా పరమేశ్వరి ఆలయం, పట్టణ శివారులోని కృష్ణాపురం గ్రామం సమీపంలో చెవిటమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. కన్యకా పరమేశ్వరి ఆలయంలో గల సుమారు 5కిలోల వెండి వస్తువులు, ఒక తులమున్నర బంగారు నగలు, హుండీలోగల సుమారు రూ. 30వేలు నగదు దొంగిలించారు. అలాగే చెవిటమ్మతల్లి ఆలయంలో కొంత నగదు మాత్రమే చోరీకి గురైంది. కన్యకాపరమేశ్వరి ఆలయం వెనక వైపు ఉన్న గోడ పైనుంచి దూకి తాళాలను గ్యాస్ కట్టర్‌లతో కోసి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు కట్ చేసి దానికి సంబంధించిన బాక్స్‌ను దుండగులు తీసుకొని వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం అర్చకుడు బలివాడ మృత్యుంజయ శాస్త్రి ఆలయానికి వెళ్లగా లోపల తలుపులు తెరిచి ఉండడంతో ఆలయ ధర్మకర్తకు సమాచారం అందించారు.

ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది క్లూస్‌టీమ్‌తో వచ్చి పరిశీలించారు. గుడిలో రాత్రి కాపలాదారుగా పనిచేస్తున్న బొబ్బిలి రామారావు అనారోగ్యం కారణంగా గురువారం విధులకు హాజరు కాలేదు. దీంతో సులువుగా దొంగతనం జరిగిందని చెబుతున్నారు.

కొత్తకోటలో రెండు మోటార్లు చోరీ



మోటార్లు దొంగిలించడంతో ఖాళీగా ఉన్న బోరు

లావేరు: మండలంలోని కొత్తకోట గ్రామంలో గల వ్యవసాయ పొలాల్లో రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయని రైతులు శుక్రవారం తెలిపారు. జాగు అమ్మాజీ, పులపా మల్లేశ్వరరావు అనే రైతులు బోర్లు వేసి మోటార్లు బిగించి వ్యవసాయం చేస్తున్నారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి బోర్లకు బిగించిన ఉన్న మోటార్లను తీసుకెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం రైతులు పొలానికి వెళ్లి చూడగా మోటార్లు కనిపించకపోవడంతో లావేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పక్కా వ్యూహం.. గెలుపే లక్ష్యం

- టెక్కలిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



కాయల వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, నాయకులు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికతో ఎన్నికలకు సమాయత్తం కావాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి తదితరులు పిలుపునిచ్చారు. టెక్కలిలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలంతా శుక్రవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందజేస్తున్నారని, టెక్కలి గెలుపును ఆయనకు కానుకగా ఇవ్వాలని తెలిపారు. రానున్న ఎన్నికల తర్వాత అచ్చెన్నాయుడుకు టీడీపీ అధ్యక్ష పదవి ఊడిపోయి టెక్కలి నియోజకవర్గం నుంచి పారిపోయే రోజులు వస్తాయని ఆయన జోస్యం చెప్పారు.

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీరడమే కాకుండా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌ఫీల్డ్ పోర్టును కానుకగా ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని బహుమతిగా ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రాణం పణంగా పెట్టి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తానని మాట ఇచ్చారు. వంద రోజుల కార్యాచరణతో లోపాలను సరిదిద్దుకుని అచ్చెన్నాయుడును తరిమికొడతామని దువ్వాడ అన్నారు.

అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యక్తుల కోసం కాకుండా ఈ నియోజకవర్గానికి ఎంతో మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న టీడీపీకి చెందిన ఎంపీ, టెక్కలి ఎమ్మెల్యేలను ఓడిస్తే మన నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వాణి ఆకాంక్షించారు. అనంతరం కాయల వెంకటరెడ్డి, దువ్వాడ శ్రీనివాస్‌లను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, వైస్ ఎంపీపీ పి.రమేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు ఎస్.సత్యం, బి.మురళీ, కె.గోవింద్, బి.మధు, నాయకులు ఎస్.సత్యరాజ్, బి.నాగేశ్వరరావు, కె.ధర్మారావు, ఎం.భాస్కర్‌రెడ్డి, జి.నాగు, జీ.వి.రెడ్డి మాస్టారు, పి.రవికుమార్ రెడ్డి, శ్యామ్‌నాయుడు, జె.జయరాం, కె.రామరాజు, గున్నమ్మ, పి.రామకృష్ణ, ఎస్.మోహన్, వై.మన్మథరావు, ఎన్.శంకర్, డి.సిమ్మన్న, డాక్టర్ దువ్వాడ హైందవి మోహన్‌తో పాటు నియోజకవర్గంలో నాయకులు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని రాడ్డుతో దాడి

హిరమండలం: అప్పు తీర్చలేదనే కారణంతో ఇనుప రాడ్డుతో దాడి చేసిన సంఘటన మండలంలోని సుభలయ గ్రామంలో చోటుచేసుకుంది. సుభలయ గ్రామానికి చెందిన పిన్నింటి జగ్గయ్య వద్ద పదేళ్ల కిందట రాము అనే వ్యక్తి రూ.40వేలు అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చాలని జగ్గయ్య ఆయన తమ్ముడు నగేష్‌లు గురువారం రామును అడిగారు. అది కాస్తా వాగ్వాదానికి దారి తీయడంతో అన్నదమ్ములు రాముపై ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. రైటర్ ఆర్.జగన్‌మోహన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలను ఉచితంగా అందజేసేందుకు నిర్ణయించినట్లు ఆ సంస్థ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. పట్టణంలోని న్యూకాలనీ మందిరంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. దేశం మొత్తంగా లక్ష కృత్రిమ అవయవాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు సత్యసాయి సెంటర్ ట్రస్టు నిర్ణయించినట్లు చెప్పారు. ప్రమాదవశాత్తు కోల్పోయిన అవయవాల స్థానంలో కృత్రిమ అవయవాలు, వినికిడి అవయవాలు కూడా ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. కోటి మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టినట్లు వివరించారు.

రోడ్డుపై కుప్పకూలి.. ప్రాణాలు కోల్పోయి



పాణిగ్రాహి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న బంధువులు

మందస: ఓ పురోహితుని పాలిట విధి వక్రీకరించింది. కాసేపటిలో ఇంటికి వెళ్లిపోతాననుకున్న ఆయనను మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రఫుల్ కుమార్ పాణిగ్రాహి(60) అలియాస్ రాఘవేంద్ర పాణిగ్రాహి పౌరోహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన శుక్రవారం సొంత పనిమీద హరిపురం వెళ్లి తిరిగి ఇంటి వస్తుండగా కొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం పంక్చర్ అయ్యింది. దీంతో ఆయన వాహనాన్ని తోసుకువస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. సమాచారం అందుకున్న నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, చికిత్స అందజేయడానికి ప్రయత్నించగా అప్పటికే పాణిగ్రాహి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య శైలజ, కుమార్తెలు భార్గవి, మధులత ఉన్నారు. ఇంటి పెద్ద మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అటల్ పెన్షన్ యోజనపై అవగాహన

శ్రీకాకుళం: అటల్ పెన్షన్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి(ఎస్ఎల్‌బీసీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఇ.రాజబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఎస్ఎల్‌బీసీ, పీఎఫ్ఆర్‌డీఏ ఆధ్వర్యంలో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఎంతమందైనా అర్హత గల వారంతా పెన్షన్ పథకంలో చేరవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా 28 లక్షల మంది ఖాతాదారులున్నట్లు తెలిపారు.